క్లుప్తంగా

అవార్డు ప్రదానం



గార్ల: సామాజిక సేవల్లో ప్రతిభను గుర్తించిన వల్లూరి ఫౌండేషన్ వారు మహబూబాబాద్ దేవాదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ నందనం కవితకు ఆదివారం రవీంద్రభారతిలో జాతీయ బంగారు నంది అవార్డును అందజేశారు. కవిత 2008నుంచి సామాజిక సేవ చేస్తూ కేన్సర్ పేషెంట్లకు బర్త్‌డే వేడుకలు నిర్వహిస్తోంది. అనాథ పిల్లలను అక్కున చేర్చుకొని చదివిస్తున్నారు. వల్లూరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌రాజ్ చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకుంది.

యాకమ్మకు ఉత్తమ కథా పురస్కారం



మహబూబాబాద్ అర్బన్: హార్వెస్ట్ స్కూల్ ఖమ్మంలో ఖమ్మం ఇస్తటిక్ పురస్కారాల సభలో మహబూబాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ గారికి 'ఆరడుగులు' కథకి ఉత్తమ కథా పురస్కారంతో ఆదివారం సత్కరించారు. రవి మారుతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సీతారాం, కత్తి పద్మ, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఫణి మాధవి, అనిల్ డాని పాల్గొన్నారు.

మరిపెడ ఎస్సైగా జీనత్



మరిపెడ: మరిపెడ నూతన ఎస్సైగా నిమ్మతోట జీనత్ ఆదివారం బాధ్యతలు చేపట్టాడు. ఇక్కడ పనిచేసిన ఎస్సై దూలం పవన్‌కుమార్ మహబూబాబాద్‌కు బదిలీపై వెళ్లాడు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



కురవి: మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎం.సత్యనారాయణ, పీఈటీ పిల్లి కాశీనాథ్ ఆదివారం తెలిపారు. గత నెలలో జరిగిన జిల్లాస్థాయి పోటీలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కుంట అశోక్, రాసాల సింధూరకీర్తి, వరిగడ్డి ప్రీతి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో జరిగే పోటీలో పాల్గొంటారని తెలిపారు. చైర్మన్ యాదగిరి, ఉపాధ్యాయులు లత, శ్రీరామ్, దీపిక, సునీత, వీరన్న, రజిత, ఇందిర, కిషన్ అభినందించారు.

డోర్నకల్‌కు పూర్వ వైభవం తెస్తాం..

ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్



డోర్నకల్: క్రిస్మస్ కానుకల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

డోర్నకల్: అభివృద్ధిపరంగా డోర్నకల్‌కు పూర్వవైభవం తెస్తామని డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తరువాత మొదటిసారి డోర్నకల్‌కు వచ్చిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. బైపాస్ రోడ్డు నుంచి రైల్వేస్టేషన్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డు, బైపాస్ రోడ్డులో కాంగ్రెస్ అభిమానులు ఎమ్మెల్యే దంపతులను గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం డీడీ ఈఎం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో క్రిస్టియన్లకు క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అందిస్తామని తెలిపారు. బిషప్ అజరయ్య ఫంక్షన్ హాలులో జరిగిన విజయోత్సవ సభలో ఆదర్శవంతమైన పాలనతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపాడు. డోర్నకల్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుమేర్‌చంద్‌జైన్, మాదా శ్రీనివాస్, ఎల్లావుల హరికృష్ణ, తాళ్లూరి హనుమంతరావు, సుశీల్‌కుమార్‌జైన్, తాళ్లూరి గంగాధర్, తారాచంద్, వెంకటేశ్వర్లు, సర్పంచులు వెంకట్‌బాబు, లెనిన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ గ్యారంటీ

కురవి: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ గ్యారంటీ ఇస్తుందని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. ఆదివారం సీరోలు మండల కేంద్రంలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన దుస్తులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, సర్పంచ్ శ్యామల రంగమ్మ, ఎంపీటీసీ తేజావత్ భోజ్యానాయక్, కొత్తూరు(సీ) సర్పంచ్ యానాల గంగాధర్‌రెడ్డి, నాయకుడు మాలోత్ నెహ్రూనాయక్, సీరోలు, కురవి మండల అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, అంబటి వీరభద్రం పాల్గొన్నారు.

జనాలను హడలెత్తిస్తున్న శునకాలు



గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

చిన్నగూడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో శునకాల బెడద ఎక్కువై జనాలు హడలెత్తిపోతున్నారు. రహదారుల్లో, వీధుల్లో శునకాలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ మూకుమ్మడిగా దాడులకు పాల్పడుతున్నాయి. వాహనదారులు, చిన్నారులు, వృద్ధులు కుక్క కాటు బారిన పడి గాయాల పాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. తాజాగా ఆదివారం మండలంలోని విస్సంపల్లి గ్రామంలో గొర్ల కాపరి పాక సైదులును కుక్క కరవడంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. శునకాల భయంతో చిన్నారులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చిన్నగూడూరు, ఉగ్గంపల్లి, జయ్యారం, విస్సంపల్లి తదితర గ్రామాల్లో కుక్క కాటు సమస్యలు మరింత విపరీతంగా పెరుగుతున్నాయి. అధికారులు శునకాల దాడి నుంచి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు తెలుపుతున్నారు.

క్రిస్టియన్లకు నిత్యావసరాల పంపిణీ



మహబూబాబాద్ రూరల్: సరుకులు పంపిణీ చేస్తున్న రాందాసు



కేసముద్రం: సరుకులు పంపిణీ చేస్తున్న సమ్మయ్య గౌడ్

మహబూబాబాద్ రూరల్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని టీపీసీసీ రాష్ట్ర సంయుక్త కోఆర్డినేటర్ పింద్రాల రాందాసు పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులను ఆదివారం పంపిణీ చేశాడు. ఎస్బీఐ చీఫ్ మేనేజర్ నికోలస్ విద్యాసాగర్, మేనేజర్ విజయ్ రావు, ఓరుగంటి రమేష్, పింద్రాల ముత్తయ్య దాతలుగా వ్యవహరించారు.

కేసముద్రం: క్రిస్మస్ సందర్భంగా మండల కేంద్రంలో నిరుపేద క్రిస్టియన్‌లకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.3వేలకు పైగా విలువైన నిత్యావసర కిట్లను ఫౌండేషన్ చైర్మన్, మండల కాంగ్రెస్ నేత చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆదివారం అందజేశాడు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాస్టర్‌లు విక్టర్ పాల్, జోసఫ్, సురేష్, ప్రభుజీవన్, మహేందర్ పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో మాదిగల అణచివేత



మాట్లాడుతున్న రవీందర్

నెహ్రూసెంటర్: రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలతోపాటు అన్నిరంగాల్లో మాదిగలు అణచివేతకు గురవుతున్నారని మాదిగల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్‌మాదిగ అన్నారు. ఐక్యవేదిక సమావేశం జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాదిగ మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో రాణించేలా మాదిగలంతా ఐక్యమత్యంతో ముందుకు సాగాలన్నారు. మాదిగలను చైతన్యం చేస్తూ ఒక వేదికను ఏర్పాటు చేయడమే మాదిగల ఐక్యవేదిక లక్ష్యమన్నారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకులు ఇసంపల్లి సైదులు, వెంకన్న, సైదులు, శ్రీనివాస్, సంకినేని సుధాకర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

30నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు

గార్ల: పీవైఎల్ గార్ల మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30నుంచి 4 మండలాల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు ఆదివారం తెలిపాడు. ఈనెల 30, 31వ తేదీల్లో గార్ల, బయ్యారం, ఇల్లెందు, గూడూరు మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్, పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు టీం ఎంట్రీలను నమోదు చేసుకోవాలని సూచించారు.

చేయూతనివ్వడం అభినందనీయం



దుప్పట్లను బిషప్‌కు అందజేస్తున్న శ్రీనివాస్

డోర్నకల్: పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని డోర్నకల్ అధ్యక్ష మండల పీఠాధిపతి డాక్టర్ రెవ.కోడిరెక్క పద్మారావు తెలిపారు. డోర్నకల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు మాదా శ్రీనివాస్ క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చర్చి కాంపౌండ్‌లోని హాస్టళ్లతో పాటు పట్టణంలోని ప్రభుత్వం హాస్టళ్లలోని విద్యార్థుల కోసం వెయ్యి దుప్పట్లను సమకూర్చారు. చర్చి కాంపౌండ్ హాస్టళ్ల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఆదివారం దుప్పట్లను బిషప్‌కు అందజేశారు. ఈసందర్భంగా బిషప్ పద్మారావు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల చదువులకు చేయూతనందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఐ బి.ఉపేందర్‌రావు, స్త్రీల మైత్రి సంఘం అధ్యక్షురాలు విజయకుమారి, కాంగ్రెస్ నాయకులు మాదా శ్రీనివాస్, కాలా సుమేర్‌చంద్‌జైన్, సుశీల్‌కుమార్‌జైన్, ప్రవీణ్ ఉపాధ్యాయులు తలారి విద్యాసాగర్, పాస్టర్ రామారావు పాల్గొన్నారు.

గోవులను పరిరక్షించుకోవాలి



తొర్రూరు రూరల్: భారత సంస్కృతి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కారణభూతమైన గోవులను పరిరక్షించుకోవాలని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. ఆదివారం మండలంలోని దుబ్బతండాలోని సోమేశ్వర గోసంరక్షణసేవా సంఘం వారి ఆధ్వర్యంలో 10మంది రైతులకు లేగ దూడలను ఉచితంగా అందించారు. ఈసందర్భంగా మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ ఇలాంటి సేవ కార్యక్రమాలను అన్నివర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ, భారత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేశ్వర్‌రావు, సర్పంచ్ విజయ్‌కుమార్, రాధాకృష్ణ, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో క్రిస్మస్ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ కిట్ల పంపిణీ కార్యక్రమానికిగాను సర్పంచ్ దార్ల రామ్మూర్తికి సమాచారం ఇచ్చినప్పటికీ, సమాచారం ఇవ్వలేదంటూ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని, ఇనుగుర్తి ఎంపీటీసీ తమ్మడపల్లి రజినికుమార్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు దేవులపల్లి వెంకన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సలీమ్ అన్నారు. ఆదివారం ఇనుగుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ బైరు అశోక్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, కొట్టం మహేందర్, చిన్నాల కట్టయ్య, యాకయ్య పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ఇల్లెందు ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

బయ్యారం: మండలంలోని బయ్యారం, నర్సాతండా గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా క్రిస్టియన్లకు ముందస్తుగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపాడు. నర్సాతండాలో నూతనంగా నిర్మించిన చర్చిని ఆయన ప్రారంభించాడు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సర్పంచులు కోటమ్మ, రాజు, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీటీసీలు శైలజ, మోహన్‌జీ, కోఆప్షన్ సభ్యులు బాబా, ఉపసర్పంచ్ కవిత, సొసైటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముసలయ్య, సత్తిరెడ్డి, రాంమూర్తిగౌడ్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రాము, సుమన్, మధుకర్, వెంకన్న పాల్గొన్నారు.

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

గార్ల: మిర్చి తోటల్లో వేరుకుళ్లు తెగులు, నల్ల తామర పురుగు ఆశించడంతో తోటల్లో పూత, కాత లేకపోవడంతో తోటలు ఎండిపోతున్నాయని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సీతంపేట, పోచారం, ముత్తితండా, గోపాలపురం గ్రామాల్లో ఎండిపోయిన మిర్చితోటలను సందర్శించిన అనంతరం ఆయన గార్లలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు మిర్చి తోటలను సందర్శించి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాజారావు, పెద్దవెంకటేశ్వర్లు, అంబటి వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డుపై గుంత



రోడ్డుపై ఏర్పడిన గుంత

దంతాలపల్లి: మండలకేంద్రం నుంచి సూర్యాపేట వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడింది. ఈ గుంత ఏర్పడి సుమారు 6నెలలు కావస్తున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. ప్రధాన రహదారి కావడంతో వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయి. కొత్తగా ఈ రహదారి ద్వారా వెళ్లే వాహనదారులు ఇబ్బందుల పడాల్సి వస్తోంది. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకముందే సంబంధిత అధికారులు గుంతను పూడ్చి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

మాజీ సర్పంచ్ మృతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి మాజీ సర్పంచ్, న్యూడెమోక్రసీ పార్టీ నాయకుడు కామ్రేడ్ సంద వెంకన్న అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందాడు. మాజీ జెడ్పీటీసీ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు గ్రామానికి వెళ్లి సంతాపం తెలిపి అంతిమయాత్రలో పాల్గొన్నాడు.

గుండెపోటుతో నాయకుడు..

గార్ల: మండలం లోని చిన్నబంజర గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తేజావత్ హరిసింగ్ నాయక్(65) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతిచెందాడు. మృతుడి మృతదేహాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధనియాకుల రామారావు, గుండా వెంకట్‌రెడ్డి, హతీరాం సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

పేదలకు పండ్లు పంపిణీ

కురవి: క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని మరనాత విశ్వాస సమాజం సంఘం రెవరెండ్ ఎల్.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు పండ్లు పంపిణీ చేశాడు. కార్యక్రమంలో విశ్వాస సమాజం సంఘం సభ్యులు మేడి రాములు, మరియ, ఏసేపు, వినోద, శ్రీను, ఉపేందర్, మధు, సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

అయ్యప్పస్వాముల నగర సంకీర్తన

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెం గ్రామంలో ఆదివారం అయ్యప్ప మాలధారులు ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఘనంగా నగర సంకీర్తన చేశారు. గ్రామంలోని గురుస్వాములు బాద నర్సయ్య, చిర్ర యుగేందర్, ఆదిరెడ్డి, జోన్నగడ్డ యాకయ్య, నగేష్ అధ్వర్యంలో వీధుల గుండా సంకీర్తనలు చేశారు.

రేపు దత్త జయంతి మహోత్సవం

మహబూబాబాద్ రూరల్: దత్త జయంతి మహోత్సవం పూజా వేడుకలను పట్టణంలోని శ్రీషిర్డీసాయి మందిరంలో ఈనెల 26వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నామని శ్రీసాయి మందిర సేవా ట్రస్ట్ అధ్యక్షుడు వందనం కమల్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి చంద్రప్రకాశ్, కోశాధికారి బొడ్ల రామకృష్ణ ఆదివారం తెలిపారు.

ఆయుర్వేద వైద్యంతోనే ఆరోగ్యం

తొర్రూరు రూరల్: ఆయుర్వేద వైద్యంతో ప్రతివ్యక్తి క్షేమంగా ఉంటాడని సర్పంచ్ ధర్మరాపు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని గోపాలగిరి గ్రామంలో ఆయుర్వేద సదస్సు నిర్వహించారు. సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రజలు ఆయుర్వేద వైద్యాన్ని స్వీకరించాలని, అప్పుడే అన్నివర్గాల ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పౌండర్ ఎనమాల రవి, నాయకులు కృష్ణరెడ్డి, పద్మరావు, వెంకన్న గౌడ్, ప్రకాష్, బీమయ్య, పరుశరాం పాల్గొన్నారు..

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి దగ్ధం



కేసముద్రం: పంటపొలం నుంచి ఓ రైతు రెండెకరాల గడ్డిని ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకెళ్తుండగా విద్యుత్ తీగలు తాకడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి గడ్డికి నిప్పంటుకున్న సంఘటన మండలంలోని బోడమంచ్యాతండా జీపీలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్పంచ్ అరుణ భర్త మాలునాయక్ తన పంటపొలం నుంచి రెండెకరాల గడ్డిని ట్రాక్టర్ ద్వారా ఇంటికి తరలిస్తుండగా, తండాలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తాకడంతో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడడంతో గడ్డికి మంటలు అంటుకున్నాయి. గమనించిన మాలునాయక్ ప్రధాన రహదారిపైకి ట్రాక్టర్‌ను తీసుకువచ్చాడు. దీంతో ప్రమాదం తప్పినట్లయింది.

ఎమ్మెల్యేకు అభినందనలు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌ను వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ రాములునాయక్ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపాడు.

మొక్కు చెల్లింపు

దంతాలపల్లి: ఎమ్మెల్యేగా రాంచంద్రునాయక్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో మండలంలోని దాట్ల గ్రామ ఎంపీటీసీ కొమ్మినేని సతీష్ ఆదివారం గ్రామ యువకులతో కలిసి, తమిళనాడులోని భవాని మాత దగ్గర మెక్కులు చెల్లించుకున్నాడు.

అయోధ్య రామమందిర అక్షింతలతో ర్యాలీ

ఖానాపురం: అయోధ్య రామమందిరం నుంచి తెచ్చిన అక్షింతలతో మండల కేంద్రంలోని రామాలయ హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో బాధ్యులు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కమిటీ బాధ్యులు కాలినడక ఖానాపురం, బుధరావుపేట, మంగళవారిపేట, ధర్మరావుపేట, కొత్తూరు గ్రామాలకు అక్షింతలను ర్యాలీగా తీసుకెళ్లారు. ఖానాపురంలోని రామాలయంలో రామపారాయణ పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని కమిటీ బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో రమేశ్, రాంనర్సింహారెడ్డి, చౌదరీ, ఉమారాణి పాల్గొన్నారు.

అధికారులే కాంట్రాక్టర్లు..!

- కేజీబీవీ అభివృద్ధి నిధుల స్వాహాకు యత్నం
- టెండర్లు లేకుండా తూతూమంత్రంగా పనులు
- పోలారం కేజీబీవీకే సుమారు రూ.78లక్షలు మంజూరు
- సంతకాలు చేయాలని ఎస్‌ఎంసీ చైర్మన్‌లపై ఒత్తిడి



పోలారం కస్తూర్బా ప్రహరీ ఫెన్సింగ్ ఏర్పాటు కోసం ఏర్పాటు చేసిన గ్రిల్

కొత్తగూడ: అధికారులు అనుకుంటే అక్రమాలకు కాదేది అనర్హం అన్నట్టు.. కస్తూర్బా గురుకుల పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులను స్వాహా చేసేందుకు భారీ స్కెచ్ వేశారు. కేజీబీవీలను ఆధునీకరించేందుకు కావాల్సిన నిధులను ఎన్నికల ముందు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసింది. అధికారులు, రాజకీయ నాయకులు ఎన్నికల పనుల్లో ఉంటారు మనల్ని ఎవరు గమనించరని అనుకున్నారో ఏమో కానీ గుట్టు చప్పుడు కాకుండా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులే కాంట్రాక్టర్లుగా మారి పనులు ప్రారంభించారు.

టెండర్లు లేకుండానే పనులు

టెండర్లు నిర్వహిస్తే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాల్సి వస్తుందనుకున్న అధికారులు సంబంధిత శాఖ నిబంధనల మేరకు రూ.30లక్షల లోపు పనులను విభాగించారు. అలా నివేదికలు తయారు చేసిన అధికారులు ఎస్‌ఎంసీ కమిటీల పేరుతో టెండర్లు లేకుండా నామినేట్‌గా నేరుగా అధికారులే పనులు చేయడం ప్రారంభించారు. ఎస్‌ఎంసీ సభ్యులకు కనీస సమాచారం లేక పోవడం విశేషం. కేజీబీవీ ఎస్‌ఓలతో కలిసి పనుల అగ్రిమెంట్‌పై సంతకాలు చేయాలని ఒత్తిడి చేయడం అధికారుల కుమ్మక్కు అయ్యారనేందుకు నిదర్శనంగా నిలుస్తోంది. కాగా మిగతా ప్రభుత్వ శాఖలలో రూ.10లక్షలు దాటిన ప్రతీ పని టెండర్ నిర్వహించాలనే నిబంధన ఉన్నట్లు కాంట్రాక్టర్లు అంటున్నారు.

మంజూరైన పనుల వివరాలు

కొత్తగూడ మండలం పోలారం కేజీబీవీ అభివృద్ధి కోసం మేయింటనెన్స్ మరియూ రిపేర్లకు రూ.28.55లక్షలు, ప్రొవైడింగ్ ఫర్నిచర్ కోసం రూ.29.40లక్షలు, ప్రొవైడింగ్ డ్యూయెల్ డెస్క్ రూ.9.50లక్షలు, డైనింగ్ హాల్‌లో ఫర్నిచర్ కోసం రూ.9.50లక్షలు పెద్ద వంగర కేజీబీవీ బోర్‌వెల్ డ్రిల్లింగ్, వాటర్ సంప్ నిర్మాణం కోసం రూ.9లక్షలు, ప్రహరీ లింక్‌డ్ వైర్ ఫెన్సింగ్‌కు రూ.28లక్షలు, మరిపెడ కేజీబీవీకి ప్రొవైడింగ్ ఫర్నిచర్ కోసం రూ.29.40లక్షలు, ప్రొవైడింగ్ డ్యూయెల్ డెస్క్ రూ.9.50లక్షలు, డైనింగ్ హాల్‌లో ఫర్నిచర్ కోసం రూ.9.50లక్షలు, తొర్రూరు కేజీబీవీకి ప్రొవైడింగ్ ఫర్నిచర్ కోసం రూ.29.40 లక్షలు, ప్రొవైడింగ్ డ్యూయెల్ డెస్క్ రూ.9.50లక్షలు, డైనింగ్ హాల్‌లో ఫర్నిచర్ కోసం రూ.9.50లక్షలు, నర్సింహులపేట కేజీబీవీకి ప్రొవైడింగ్ ఫర్నిచర్ కోసం 29.40 లక్షలు, ప్రొవైడింగ్ డ్యూయెల్ డెస్క్ 9.50లక్షలు, డైనింగ్ హాల్‌లో ఫర్నీచర్ కోసం 9.50లక్షలు మొత్తం రూ.2.59కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను ఇంజనీరింగ్ అధికారులే కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఎస్‌ఎంసీ సభ్యులే పనులు చేస్తున్నారు..

రూ.30లక్షల లోపు పనులకు టెండర్లు ఉండవు. ఇప్పుడు మంజూరు అయిన పనులను పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులే చేసుకుంటున్నారు. మేము నాణ్యతా ప్రమాణాలను మాత్రమే పర్యవేక్షించి ఎంబీ రికార్డు చేయిస్తాం.

– అరుణ్‌కుమార్, డీఈ

పనుల గురించి నాకు తెలియదు



కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో జరుగుతున్న పనుల గురించి నాకు తెలియదు. ప్రతీ నెల జరిగే సమావేశాల్లో కనీసం చర్చించలేదు. నేను ఎక్కువగా చదువుకోలేదని, అధికారులు ఏమైనా పేపర్లపై సంతకాలు చేయించారో అనే అనుమానం ఉంది.

– బంగారి నీలవేణి, కస్తూర్బా గురుకుల ఎస్‌ఎంసీ అధ్యక్షురాలు, పోలారం

శబరిమలకు అయ్యప్ప మాలధారులు



మహబూబాబాద్ రూరల్: అయ్యప్పస్వామివారి దీక్ష స్వీకరించిన స్వాముల ఇరుముడిధారణ పూజలు జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం కనుల పండువగా జరిగాయి. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. 41 రోజుల అయ్యప్పస్వామి దీక్ష పూర్తి చేసుకుని ఇరుముడిధారణతో స్వాములు శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో గురుస్వాములు మస్తాన్ రెడ్డి, ఎడ్ల రమేష్ మహిపాల్ రెడ్డి, ఉపేందర్, వెంకన్న, నాగన్న, శ్రీనివాస్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.